మీ గళం.. మా కలం...!

# నమస్తే హైదరాబాద్

www.namasthehyderabad.in

తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను

నిత్యనూతనంగా వెలువడుతూ విశేష ప్రజాధరణ పొందుతున్న నమస్తే హైదరాబాద్ తెలుగు దినపత్రికకు తెలంగాణ రాష్ట్రం లోని అన్ని జిల్లా, మండల కేంద్రాలలో విలేకరులు కావలెను

సీనియర్లకు ప్రాధాన్యం కొతవారికి అవకాశం

Ph: 9912580066

రంగా రెడ్డి సంపుటి : 13 సంచిక :170 ఎడిటర్: గొడిశాల సోమయ్య ఆదివారం 17-11-2024 పేజీలు :4 వెల : 2రూ

## మంత్రి పొన్నం ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు

నమస్తే హైదరాబాద్ : వరంగల్: వికారాబాద్ కలెక్టర్ దాడి అంశం తెలంగాణ రాజకీయాల్లో కాక రేపుతోంది. అధికార కాంగ్రెస్- విపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. కలెక్టర్‌పై దాడి, మూసి పునరావాసం అంశాలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేసిన కామెంట్స్ తేనె తుట్టేను కదిపినట్టయ్యింది. కేంద్రమంత్రి తీరును రాష్ట్ర మంత్రులు తప్పు పట్టారు. అసలు మీ స్టాండ్ ఏంటి.. కలెక్టర్‌పై దాడి చేయడాన్ని సమర్థిస్తున్నారా అని ప్రశ్నించారు.కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సొంత అభిప్రాయం లేదు. పక్క వారు చెప్పినట్టు నడుచుకుంటారు. ఇప్పుడు కూడా కేసీఆర్ చెప్పినట్టు వ్యవహరిస్తున్నారు. కేసీఆర్ ఆదేశాలతో కిషన్ రెడ్డి మూసి అంశం గురించి మాట్లాడారు. కిషన్ రెడ్డి మీ నిద్ర వీడండి. మూసీ కాలువ వాసన చూసిన తర్వాత అయినా నిజం మాట్లాడాలి. ఆ దేవుని సాక్షిగా వాస్తవాలు చెప్పాలి. రాష్ట్రానికి నిధులు మంజూరు చేయడంలో ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి తీసుకొచ్చావా..? మీరు అసలు తెలంగాణ బిడ్డేనా.. మీరు ఒక్కసారి డీఎన్ఏ పరీక్ష చేసుకోండి. పార్లమెంట్‌లో తెలంగాణ రాష్ట్ర బిల్లు ఎలా పాస్ అయ్యిందో మీకు తెలుసా..? ఆ రోజులు మరచిపోయారా అని' మంత్రి పొన్నం ప్రభాకర్ నిప్పులు చెరిగారు.'రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటును మీరు వ్యతిరేకిస్తున్నారా..? ప్రజాభిప్రాయ సేకరణ కోసం వచ్చిన అధికారులతో ప్రవర్తించేది అలాగేనా..? జిల్లా మేజిస్ట్రేట్ అయినా కలెక్టర్‌పై దాడి చేయడాన్ని సమర్థిస్తారా..? ఆ దాడిని ఖండించని మీరు కేంద్రమంత్రిగా ఉండే అర్హత కోల్పోయారు. కలెక్టర్, అధికారులపై దాడి చేసిన వారు, చేయించిన వారిని వదిలే ప్రసక్తే



లేదు. ఈ ఘటనపై మీ వైఖరి ఏంటో చెప్పాలి. మీ పార్టీ స్టాండ్ ఏంటో బహిరంగ పరచాలి. కేంద్రమంత్రిగా రాష్ట్రానికి ఏం చేశావ్. ఎంపీగా సికింద్రాబాద్‌కు ఏం చేశావ్. ఇదే అంశంపై దమ్ముంటే బహిరంగ చర్చకు రా అని' పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు.

## రేవంత్ పాలనకు పరాకాష్ట లగచర్ల ఘటన : సత్యవతి రాథోడ్



నమస్తే హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిపాలనకు పరాకాష్ట లగచర్ల ఘటన అని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మండిపడ్డారు. లగచర్ల బాధితులతో కలిసి బీఆర్ఎస్ నేతలు కలిసి ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను శనివారం కలిశారు. కమిషన్ చైర్మన్‌కు పిటిషన్‌ను సమర్పించారు. బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని కోరిన నేతలు కోరారు. అనంతరం సత్యవతి రాథోడ్ మీడియాతో మాట్లాడారు. కలెక్టర్, అధికారులపై దాడి చేశారని అమాయకులైన రైతులపై అక్రమ కేసులు పెట్టారని, దాడి చేశారని మండిపడ్డారు. రేవంత్ నియోజకవర్గంలో ఫార్మా కంపెనీ కోసం గిరిజనుల భూమి మాత్రమే ఉందా ? అంటూ ప్రశ్నించారు.రేవంత్ రెడ్డి అధికారం , దూరంకారం గిరిజనులపై చూపిస్తున్నాడని మండిపడ్డారు. భూమిపుత్రుల భూములను గుంజుకొనే ప్రయత్నం మానుకోవాలని హితవు పలికారు. వారి కడుపుకాలి తిరగపడితే వారిపై హత్యాయత్నం కేసులు పెట్టారని మండిపడ్డారు. ఫార్మా సిటీ ప్రయత్నాన్ని విరమించుకొని.. గిరిజనులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులపై జరిగిన దాడిని వ్యతిరేకిస్తున్నామని.. కానీ, ఒక కలెక్టర్ అక్కడికి వెళ్తే ఒక్క పోలీస్ అధికారి లేకపోవడంపై అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఇంటలిజెన్స్ ఏమైంది ? అంటూ నిలదీశారు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా కక్ష రాజకీయాలు మానుకొని పాలనపై దృష్టి పెట్టాలని సూచించారు.

## తెలంగాణలో కాంగ్రెస్‌కు రక్షణ కవచంగా మారిన బీజేపీ : కేటీఆర్



నమస్తే హైదరాబాద్ : హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి బీజేపీ రక్షణ కవచంగా పనిచేస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. రేవంత్ రెడ్డికి బండి సంజయ్ సహాయక మంత్రిగా మారాడని కేటీఆర్ ధ్వజమెత్తారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని పలువురు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా కేటీఆర్ ప్రసంగించారు.

మేము రేవంత్ రెడ్డిని తిడితే బండి సంజయ్, రఘునందన్ రావు, విశ్వేశ్వర్ రెడ్డి, ధర్మపురి అర్వింద్ తట్టుకోలేకపోతున్నారు. వాళ్ళకు రోషం వస్తోంది. అసలు ఆ ఎంపీలు బీజేపీలో ఉన్నారా..? కాంగ్రెస్ పార్టీలో ఉన్నారా? రేవంత్ కూడా బీజేపీలో ఉన్నాడా? కాంగ్రెస్‌లో ఉన్నాడా? అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని కేటీఆర్ తెలిపారు.

త్రిపుల్ ఆర్ సినిమా కన్నా ఆర్ఆర్ ట్యాక్స్‌లు ఎక్కువ అయ్యాయంటూ ప్రధాని మోడీయే అన్నాడు. కానీ రేవంత్ రెడ్డిపై ఎందుకు చర్యలు లేవు. మణికొండలో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులను పంచుకున్నారు. మణికొండ, మక్తల్, భువనగిరిలో కలిసి కాపురం చేస్తున్నది ఎవరు..? మళ్లీ వాళ్లే సిగ్గు లేకుండా మాట్లాడతారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు పదవులు పంచుకున్నట్లు ఒక్క సంఘటనైనా చూపించగలరా? అని కేటీఆర్ ప్రశ్నించారు.

## మూసీ బస్తీల్లో బీజేపీ ఎంపీల మకాం



నమస్తే హైదరాబాద్ : తెలంగాణలో రాజకీయాలు రోజు రోజుకు రసవత్తరంగా మారుతున్నాయి. గత కొన్ని రోజులుగా మూసీ ప్రక్షాళన అంశం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. అధికార ప్రతిపక్ష నేతల మధ్య ఘాటు విమర్శలు, జోరు సవాళ్లు నడుస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే.. ప్రతిపక్షాలకు సీఎం రేవంత్ రెడ్డి ఓ సవాల్ విసరగా.. దాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్వీకరించారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డి.. ప్రతిపక్షాలు చేసే విమర్శలకు చాలా ఘాటుగా తిప్పికొడుతున్నారు. మూసీ పరివాహక ప్రాంతాల్లోని పేద ఇండ్లు కూల్చితే ఊరుకునేది లేదని.. పేదల

2లో

## పుప్పాల్‌గూడలో భారీ అగ్ని ప్రమాదం



నమస్తే హైదరాబాద్ : హైదరాబాద్ పుప్పాల్‌గూడలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గోల్డెన్ ఓరియో అపార్ట్‌మెంట్‌లోని ఓ ఇంట్లో మంటలు చెలరేగాయి. ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలటంతో మంటలు వ్యాపించాయి. మంటలు వ్యాపించగానే ఇంట్లోని ఐదుగురు

2లో

## తెలంగాణలో గీత కార్మికులకు గుడ్‌న్యూస్..



నమస్తే హైదరాబాద్ : తెలంగాణలోని గీత కార్మికులు రేవంత్ రెడ్డి సర్కార్ మరో గుడ్ న్యూస్ వినిపించింది. ఇప్పటికే కల్లు గీత కార్మికుల రక్షణ కోసం.. కాటమయ్య రక్షక కవచాలను సర్కార్ పంపిణీ చేస్తుండగా ఇప్పుడు వారి కోసం మరో తీపికబురు వినిపించారు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్. శనివారం (నవంబర్ 16న) రోజున హుస్నాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో.. గీత కార్మికులకు.. వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కాటమయ్య రక్షక కవచాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్.. తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికులు చనిపోకుండా ఉండేందుకు.. ఐఐటీ విద్యార్థులు రక్షక కవచాన్ని తయారు చేయగా వాటిని కాటమయ్య రక్షక కవచం పేరుతో రేవంత్ రెడ్డి సర్కార్ పంపిణీ చేస్తోందని మంత్రి చెప్పుకొచ్చారు. ఈ కిట్‌పై క్షేత్ర స్థాయిలో శిక్షణ ఇచ్చే విషయంలో ఎక్కడా జాప్యం జరగకూడదని అధికారులను మంత్రి ఆదేశించారు. అవసరమైతే ప్రభుత్వం ఇచ్చే నిధులతో పాటు ఎమ్మెల్యే నిధులు, పార్లమెంటు సభ్యుని నిధులను కూడా వెచ్చించి పంపిణీ చేస్తామని చెప్పుకొచ్చారు. గీత కార్మికులు వృత్తిలో ఉంటూ కుటుంబాన్ని పోషించుకుంటూ.. పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని మంత్రి ఆకాంక్షించారు. తాటి చెట్లు ఎత్తుగా ఉండటం వల్ల అసౌకర్యంగా ఉండడం మాట వాస్తవమేనని.. అందుకోసం చెట్లు ఎత్తు తక్కువగా ఉండేలా పరిశోధనలు జరుగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు.

2లో

## హైదరాబాదీలకు తీపికబురు..



నమస్తే హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో మెట్రో రైల్ రెండో దశ నిర్మాణ పనుల్లో రేవంత్ రెడ్డి సర్కార్ వేగం పెంచింది. ఇందులో భాగంగానే కీలక ముందడుగు పడింది. మెట్రో రెండో దశలో భాగంగా.. ఓల్డ్ సిటీ మెట్రో రైల్ రూట్ కోసం భూసేకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే.. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు చేపడుతున్న 7.5 కిలోమీటర్ల మెట్రో మార్గానికి కావాల్సిన ఆస్తుల సేకరణకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. దీంతో.. ఈ మార్గంలో రోడ్డు విస్తరణ, మెట్రో స్టేషన్ల నిర్మాణానికి ఆస్తులు సేకరించే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా.. హైద్రాబాద్ మెట్రో రైలు అధికారులు భూసేకరణ కోసం నోటీసులు జారీ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మెట్రో ఫేజ్-2లో ఆరో కారిడార్‌లో భాగంగా.. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మొత్తంగా 200 ఆస్తులకు డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంది. ఆస్తుల సేకరణ కోసం డిక్లరేషన్‌కు ఈరోజు(నవంబర్ 16న) జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిషెట్టి ఆమోదం తెలిపారు. దీంతో.. ఓల్డ్ సిటీ మెట్రో కారిడార్‌కు రెండువైపుల 100 చొప్పున మొత్తం 200 ఆస్తుల సేకరణకు అధికారులు ముందడుగు వేశారు. ఆస్తుల సేకరణ పూర్తి అయితే.. కొత్త సంవత్సరం జనవరిలో మెట్రో రైలు రెండో దశ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని కలెక్టర్ అనుదీప్ వివరించారు.మెట్రో రెండో దశ ప్రాజెక్టుకు మొత్తం అంచనా వ్యయం రూ. 24,269 కోట్లు కాగా.. అందులో 30 శాతం అంటే రూ.7313 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం.. 18 శాతం అంటే రూ. 4,230 కోట్లు కేంద్ర ప్రభుత్వం వెచ్చించనుంది. 52 శాతం నిధులను రుణాలతో పాటు పీపీపీ విధానంలో సమకూర్చుకునేలా రేవంత్ రెడ్డి సర్కార్ డీపీఆర్ సిద్ధం చేసి ఇప్పటికే ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే.

## డీడీఎంఎస్ వొకేషనల్ కోర్స్ సెంటర్‌లో వివిధ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

నమస్తే హైదరాబాద్ : ఉస్మానియా యూనివర్సిటీ : దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ వొకేషనల్ కోర్స్ సెంటర్‌లో పలు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్‌కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్స్ కోర్స్), ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్, ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ తదితర సర్టిఫికెట్ కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత పదవ తరగతి అని వివరించారు.రెస్పిరేటరీ థెరపీ టెక్నీషియన్, ఈసీజీ టెక్నీషియన్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, కార్డియాలజీ టెక్నీషియన్, రేడియోగ్రఫీ అసిస్టెంట్ వంటి పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత ఇంటర్మీడియట్ అని చెప్పారు. అన్ని వయసుల వారు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులని చెప్పారు. ఈ కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 30 చివరి తేదీ అని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 8309037134, 6305895867 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## మూసీ బస్తీల్లో బీజేపీ ఎంపీల మకాం

ఇళ్లపైకి వచ్చే బుల్డోజర్లకు తాము అడ్డుగా ఉంటామంటూ బీఆర్ఎస్, బీజేపీ నేతలు చెప్తూ వస్తుండగా.. దానికి రేవంత్ రెడ్డి ఘాటుగా సమాధానం ఇచ్చారు. మూసీ ప్రక్షాళకు అడ్డొస్తే.. అడ్డొచ్చిన వాళ్లందరినీ బుల్డోజర్లతో తొక్కిస్తా అంటూ హాట్ కామెంట్స్ చేయటం సంచలనంగా మారింది. ఈ క్రమంలోనే.. మూసీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న పేదల కోసం పరితపించే ఆ ప్రతిపక్ష నేతలు వాళ్లు ఉంటున్న ప్రాంతాల్లో ఓ రెండు మూడు రోజులు ఉండి.. అంతా బాగానే ఉందని చెప్తే.. వెంటనే ప్రాజెక్టును విరమించుకుంటానంటూ సీఎం రేవంత్ రెడ్డి ఛాలెంజ్ చేశారు. ముఖ్యంగా కేటీఆర్, హరీష్ రావు, ఈటల మూడు రోజులు ఉండాలని.. వారికి అయ్యే ఖర్చు కూడా తానే భరిస్తానని చెప్పుకొచ్చారు. అయితే.. రేవంత్ రెడ్డి చేసిన ఈ ఛాలెంజ్‌ను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్వీకరిస్తున్నట్టు ప్రకటించారు. ఇండ్లు కూల్చొద్దంటుంటే.. అడ్డమొచ్చినవారిని బుల్డోజర్లతో తొక్కిస్తానంటూ ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని.. పేదల కోసం చావటానికైనా సిద్ధమేనని కిషన్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఇందులో భాగంగా.. మూసీ పరివాహక ప్రాంతాల్లో బీజేపీ నిద్ర కార్యక్రమం చేపట్టారు. ఈరోజు (నవంబర్ 16న) రాత్రి అంబర్‌పేట ప్రాంతంలోని తులసి రామ్ నగర్‌లో మూసీ పేదలు నివాసముంటున్న ప్రాంతంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సహా.. ముఖ్య నేతలు బస్తీ నిద్ర చేయనున్నారు. కిషన్ రెడ్డితో పాటు, బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కె. లక్ష్మణ్, కొండ విశ్వేశ్వర్ రెడ్డి ఇతర నేతలు మూసీ పరివాహకంలోని 20 ప్రాంతాల్లో రాత్రి బస చేయనున్నారు. శనివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆదివారం (నవంబర్ 17న) ఉదయం 9 గంటల వరకు బీజేపీ నేతలు ఆయా ప్రాంతాల్లో రాత్రి బస చేయనున్నారు. అయితే.. తులసీరాంనగర్‌లో కిషన్ రెడ్డి బస్తీ నిద్ర చేయనుండగా.. మలక్‌పేట శాలివాహననగర్‌లో లక్ష్మణ్, ఎల్బీనగర్ ద్వారకాపురంలో ఈటల బస్తీ నిద్ర చేయనున్నారు.

## తెలంగాణలో గీత కార్మికులకు గుడ్‌న్యూస్..

అయితే.. కాలువలు, చెరువు గట్లపైనా, రోడ్ల పక్కన ఇతర ప్రాంతాల్లో నాటే చెట్లల్లో 50 శాతం తాటి, ఈత చెట్లను నాటాలని మంత్రి పొన్నం తెలిపారు. జన్మదిన సందర్భాలు, శుభకార్యాల సందర్భాల్లో ప్రతి ఒక్కరూ కనీసం 10 మొక్కలు నాటి తమ బాధ్యతను చాటుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. తాటి, ఈత చెట్ల పెంపకానికి గానూ స్థలం ఉంటే బోర్లు వేయించే బాధ్యత కూడా తీసుకుంటానని మంత్రి కీలక ప్రకటన చేశారు. ఈ క్రమంలోనే.. గీత కార్మికులకు సంబంధించి ఏవైనా పాత బకాయిలు ఉన్నట్లయితే విడుదలయ్యేలా చూస్తానని పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు.

## పుప్పాల్‌గూడలో భారీ అగ్నిప్రమాదం

కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీసి ప్రాణాలు దక్కించుకున్నారు. అపార్ట్‌మెంట్ వాసులు సైతం ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో అపార్ట్‌మెంట్ ఫ్లాట్ పూర్తిగా దగ్ధం అయింది. ఇంట్లో దాచుకున్న డబ్బులు, బట్టలు, విలువైన సామాగ్రి కాలి బూడిదైంది. దాదాపు 50 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు.అయితే నిబంధనలకు విరుద్ధంగా బిల్డర్ అపార్ట్‌మెంట్ నిర్మించాడు. ఫైర్ ఇంజిన్ పోవడానికి దారిలేక పోవటంతో మంటల్ని అదుపు చేసేందుకు వచ్చిన మూడు ఫైర్ ఇంజిన్లు గంటపాటు శ్రమించాల్సి వచ్చింది. సమయానికి ఫైర్ ఇంజిన్ వచ్చినా.. లోనికి పోవడానికి దారిలేక ఫైర్ సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. చివరకు తీవ్రంగా శ్రమించి మంటల్ని అదుపులోకి తీసుకొచ్చారు. అపార్ట్‌మెంట్ నిర్వాహకుల పోలీసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టం వచ్చినట్లు అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపడితే ఎలా అని ప్రశ్నించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.ఇక ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఝాన్సీ మహారాణి లక్ష్మీబాయ్ మెడికల్ కాలేజీలో శుక్రవారం రాత్రి ఘోర అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. ఘటనలో 10 మంది చిన్నారులు సజీవంగా దహనమయ్యారు. న్యూనేటల్ ఐసీయూలో రాత్రి 11.30 గంటల సమయంలో ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదం జరగ్గానే.. రోగులు ఒక్కసారిగా భయంతో పరుగులు పెట్టారు. దీంతో తొక్కిసలాట కూడా చోటు చేసుకుంది.ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల నష్టపరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి రూ.50వేలు ఇచ్చేందుకు అధికారులను ఆదేశించారు. ఈ అగ్ని ప్రమాదం బాధాకరమని.. ఘటనలో తమ పిల్లలను కోల్పోయిన కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని ప్రధాని మోదీ వెల్లడించారు.

## ఉద్యోగ విరమణ ప్రభుత్వానికి భారం అనడం దురదృష్టకరం

### -డాక్టర్ కొలిపాక వెంకటస్వామి టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి



హనుమకొండ, నవంబర్ 16 (నమస్తే హైదరాబాద్) రిటైర్డ్ అయిన ఉద్యోగులకు ఎలాంటి బెనిఫిట్స్ అందకపోవడంతో చాలామంది ఉపాధ్యాయులు ఉద్యోగులు మానసిక వేదనకు గురై చాలా ఇబ్బందులు పడుతున్నారని టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కొలిపాక వెంకటస్వామి అన్నారు. ప్రభుత్వానికి 30 సంవత్సరాల సర్వీస్ అందించి వారి నెల జీతం నుండి రికవరీ చేసినటువంటి జీపీఎఫ్ అమౌంట్ ను వారికి సకాలంలో అందించకపోవడం చాలా బాధాకరమని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాము, అలాగే పదవి విరమణ పొందిన ఉద్యోగికి అందాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ అన్నీ ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకుండా ప్రభుత్వం వెంటనే అందించాలి అప్పుడే వాళ్ళు పదవి విరమణ అనంతరం ఒత్తిడిలకు లోను కాకుండా ప్రశాంతమైన శేష జీవితం గడపడానికి అవకాశం ఉంటుందన్నారు. పదవి విరమణ అనంతరం వారి డబ్బులు వారికి ఇవ్వడానికి కూడా ప్రభుత్వానికి భారం అని తెలియజేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగి తన జీవిత కాలంలో ప్రభుత్వం అందించే ఎలాంటి ఉచిత పథకాలకు నోచుకోడు తన తన స్వార్జితం తన సేవింగ్స్ మాత్రమే పొందుతాడు అలాంటి వాటిని సకాలంలో చెల్లించకుండా ప్రభుత్వానికి భారం అనుకోవడం చాలా దురదృష్టకరం వెంటనే ప్రభుత్వం స్పందించి పదవి విరమణ పొందిన ఉపాధ్యాయులకు ఉద్యోగులకు వారి యొక్క బెనిఫిట్స్ ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేశారు

## పీర్జాదిగూడలో వేద స్పెషాలిటీ ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం...

### - పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు,మాజీ మేయర్ జక్కు వెంకట్ రెడ్డి, కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి....









మేడ్చల్ జిల్లా, మేడిపల్లి(నమస్తే హైదరాబాద్): ఆయుర్వేదం అంటే కేవలం వైద్య పద్ధతి కాదు, ఇది మన జీవనశైలిని మార్చే మార్గం అని బీఆర్ఎస్ నాయకులు జక్కు వెంకట్ రెడ్డి అన్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఆయుర్వేద వైద్యం అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన వేద స్పెషాలిటీ ఆయుర్వేదిక్ ఆసుపత్రి 4వ వార్షికోత్సవం సందర్భంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 25వ డివిజన్ శ్రీ సాయి నగర్ కమ్యూనిటీ హాల్ నందు ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని మాజీ మేయర్ జక్కు వెంకట్ రెడ్డి, కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి ప్రారంభించారు. హెల్త్ క్యాంప్ లో జనరల్ మెడిసిన్స్, బీపీ,మధుమేహం,ఆర్థోపెడిక్,కార్డియాలజీ, గ్యాస్ట్రో,ఈ.ఎన్.టి తదితర పరీక్షలు నిర్వహించి ఉచిత ఆయుర్వేద మందులను పంపిణీ చేసారు.

– బీఆర్ఎస్ నాయకులు జక్కు వెంకట్ రెడ్డి మాట్లాడుతూ....

ఉచిత వైద్య శిబిరం ద్వారా పంచకర్మ ఆయుర్వేద వైద్య పద్ధతుల గురించి తెలుసుకోవచ్చు, ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు పొందవచ్చు. ఆయుర్వేదం అనేది శరీరాన్ని, మనసును, ఆత్మను సమతుల్యం చేయడానికి సహాయపడుతుంది. నిత్యం ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలు, మానసిక ఒత్తిడి, లేదా శక్తి తగ్గుదల వంటి సమస్యలను తగ్గించి మీ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు అవసరమైన ప్రత్యేకమైన చికిత్సలు, ఆయుర్వేదిక ఔషధాలు, మరియు జీవనశైలి మార్పులు పొందగలుగుతారన్నారు.

– కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి మాట్లాడుతూ...

మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది. పురాతన భారతీయ ఆయుర్వేద వైద్య విధానాలు, అనేక దీర్ఘకాలిక రోగాలను సైతం, ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా నయం చేయగలవు. మన పూర్వీకులు వాడిన ఈ పద్ధతులను అనుసరించడం ద్వారా, మనం ఆరోగ్యంగా ఉండవచ్చు.ఇలాంటి ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ఇక్కడ ఏర్పాటు చేసినందుకు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

– డా. కే.అంజిరెడ్డి %దీ.సా.వీ.సా% మాట్లాడుతూ....

అనవసరంగా లక్షలాది రూపాయలు ఖర్చు చేసుకోవడం కంటే, ఆయుర్వేద వైద్యాన్ని అవలంబించడం ద్వారా మన ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చు.మన చుట్టూ ఉన్న అనేక రోగాల నుంచి ఉపశమనం పొందాలంటే, ఆయుర్వేద వైద్యాన్ని నమ్మండి. ఇది మనకు ఆరోగ్యంగా ఉండటానికి, ఆనందంగా జీవించటానికి సహాయపడుతుంది. ఈ శిబిరంలో సుమారు 250 మంది స్థానికులు పరీక్షలు చేయించుకోవడం సంతోషంగా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో డివిజన్ కాలనీల అధ్యక్ష కార్యదర్శులు రవీంద్ర చారి, హరిందర్ యాదవ్, రవీందర్ రెడ్డి,విజయ్,మధుసూదన్, మోహన్ రెడ్డి, రాజు, వైద్యులు డా. జయచందర్, డా.ఎస్.అజయ్ దుర్గ ప్రసాద్, డా.బి.శివ, డా.విరాజిత, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఏదైనా సమస్య ఉంటే పోలీసులకు తెలియజేయాలి - సిఐ రఘువీర్ రెడ్డి

నాగారం, నమస్తే హైదరాబాద్ :( నవంబర్ 16) ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏదైనా సమస్య ఉంటే పోలీసులకు తెలియజేయాలని సిఐ రఘువీర్‌రెడ్డి అన్నారు. జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వుల మేరకు , డీఎస్పీ రవి ఆదేశాల మేరకు నాగారం సర్కిల్ ఇన్స్పెక్టర్ రఘువీర్ రెడ్డి, మరియు నాగారం ఎస్ఐ ఎం.ఐలయ్య మండల పరిధిలోని ఫణిగిరి,వర్ధమానుకోట ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం సందర్శించారు.ఈ సందర్భంగా సిఐ రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ ధాన్యాన్ని మ్యాచరు వచ్చే విధంగా ఆరబెట్టాలని, నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర, బోనస్ పొందాలని రైతులకు అవగాహన కల్పించారు.కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు సమన్వయం పాటించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, హమాలీలతో మాట్లాడి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు మౌలిక వసతులు కల్పించాలని రైతులకు ఎలాంటి ఆటంకాలు ఎదురు కాకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఎల్మకంటి సోమన్న, రైతులు సోమయ్య, లింగమల్లు,మహేందర్,వెంకన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## బీహార్ కూలీలకు దుప్పట్లు పంపిణీ చేసిన శ్రీ అనంతరామ రైస్ మిల్ యజమాన్యం.



దేవరుప్పుల( నమస్తే హైదరాబాద్) కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని శనివారం దేవరుప్పుల మండల కేంద్రంలో శ్రీ అనంత రామ రైస్ ఇండస్ట్రీస్ లో పని చేస్తున్న తమ 32 మంది బీహార్ కూలీలకు దుప్పట్లను పంపిణీ చేసిన శ్రీ అనంత రామ రైస్ ఇండస్ట్రీస్ యాజమాన్యం బుక్క రామయ్య అనంతలక్ష్మి, బుక్క సత్యనారాయణ,బుక్క శ్రీధర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం బీహార్ కూలీలకు ఏ కష్టం వచ్చినా ఆదుకుంటున్నామని తెలిపారు. బీహార్ నుండి వచ్చిన కూలీలు వలస వచ్చి పని చేస్తున్నారని అందుకు వారికి దుప్పట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు

# చెరువులను సుందర శోభిత వనములుగా తీర్చిదిద్దుతాం

## మల్లిగవాడ్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం పీఏసీ చైర్మన్,ఎమ్మెల్యే గాంధీ




నమస్తే హైదరాబాద్ ( శేరిలింగంపల్లి న్యూస్) :శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అన్ని చెరువులను సుందరీకరిస్తున్నామని పీఏసీ చైర్మన్,ఎమ్మెల్యే అరికపూడి గాంధీ అన్నారు.శనివారం మియాపూర్ డివిజన్ పరిధిలోని గుర్నాథం,కైదమ్మ కుంట చెరువుల సుందరీకరణ పనులను నెక్సస్ సెలెక్ట్ మాల్స్ సిఎస్ఆర్ ఫండ్స్ ద్వారా లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఆనంద్ మల్లిగవాడ్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ , నెక్సస్ సెలెక్ట్ మాల్స్ అధికారులు, ఇరిగేషన్ అధికారులతో కలిసి పీఏసీ చైర్మన్ అరికపూడి గాంధీ ప్రారంభించారు.మాట్లాడుతూ కైదమ్మ కుంట చెరువు పునరుద్ధరణ ప్రభుత్వం, పరిశ్రమలు మరియు సమాజం మధ్య భాగస్వామ్య ప్రయత్నాలు అర్థవంతమైన పర్యావరణ పురోగతిని ఎలా నడిపించగలదో చెప్పడానికి ఒక శక్తివంతమైన ఉదాహరణగా నిలుస్తుంది. ఈ ప్రాజెక్ట్ కీలకమైన సహజ వనరులను పునరుజ్జీవింపజేయడమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా భవిష్యత్తులో సుస్థిరమైన అభివృద్ధి కోసం ఒక నమూనాను ఏర్పాటు చేస్తుంది" అని అన్నారు.ఎన్నో ఏండ్ల సమస్యలు తీరుతాయని సీఎస్ఆర్ ఫండ్స్ వల్ల స్వచ్ఛమైన మంచినీటి చెరువుగా మారనుందని తెలిపారు.నెక్సస్ సెలెక్ట్ మాల్స్ అధికారులు మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుందరికరణ చేపట్టుటకు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు.చెరువు ల చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి చెరువులను సంరక్షిస్తామని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు డీఈ నళిని, ఏఈ సంతోష్ , ఐటీ సంస్థ ప్రతినిధులు రామ్ బొట్ట, చైతన్య, నెక్సస్ సెలెక్ట్ మాల్స్ ప్రతినిధులు , నాయకులు ,కార్యకర్తలు , కాలనీల అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హోమ్బుక్ ఫ్యాషన్ కళాశాలలో ఫ్రెషర్స్ డే:




నమస్తే హైదరాబాద్ ( శేరిలింగంపల్లి న్యూస్) : నూతన బ్యాచ్‌కు స్వాగతం పలికేందుకు శుక్రవారం హోమ్బుక్ ఫ్యాషన్ కళాశాలలో ఫ్రెషర్స్ పార్టీ ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆధునిక, సాంప్రదాయ దుస్తుల్లో ముస్తాబై వచ్చిన విద్యార్థినీ విద్యార్థులు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.కొందరు విద్యార్థులు డ్యాన్సులు, పాటలతో అలరించారు.విద్యార్థినీ విద్యార్థులు నిర్వహించిన ఫ్యాషన్ ఆకట్టుకుంది.

# 2కె , 5కె రన్ లను ప్రారంభించిన పీఏసీ చైర్మన్,ఎమ్మెల్యే అరికపూడి గాంధీ




నమస్తే హైదరాబాద్ ( శేరిలింగంపల్లి న్యూస్) :గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గచ్చిబౌలి స్టేడియం వద్ద ప్రణవ్ తేజ్ అక్రాంత్ దేవరకొండ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన 2%ఖ , 5ఖ% రన్ ల కార్యక్రమాన్ని పీఏసీ చైర్మన్,ఎమ్మెల్యే అరికపూడి గాంధీ జెండా ఊపి ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ యువత ప్రణవ్ తేజ్ అక్రాంత్ దేవరకొండ గార్ల ఆధ్వర్యంలో 5%ఖ , 2ఖ% రన్ నిర్వహించడం అభినందనీయమని , నేటి ఉరుకుల పరుగుల జీవితంలో శారీరక శ్రమ ఎంతో అవసరం అని గుర్తు చేయడం ఈ రన్ ఎంతగానో తోడ్పడుతుందని ఎంతో మందికి స్ఫూర్తి గా నిలుస్తుందని అన్నారు. వృద్ధులు ,యువత , చిన్న పిల్లలు పాల్గొనడం సంతోషమని , ప్రతి ఒక్కరు ఆరోగ్యము పట్ల శ్రద్ధ వహించాలని, శారీరక శ్రమ వలన మానసిక ఉల్లాసం ,ప్రశాంతత చేకూరుతుందని, పీఏసీ చైర్మన్,ఎమ్మెల్యే అరికపూడి గాంధీ అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అశోక్ గౌడ్, మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ గౌడ్, జనార్దన్ రెడ్డి,కరుణాకర్ గౌడ్, రాంచంద్రం మరియు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సీలింగ్ భూమి లో హెచ్ఎండిఏ ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలి..!





మేడ్చల్ జిల్లా, మేడిపల్లి (నమస్తే హైదరాబాద్) : మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పర్వతాపూర్ సాలార్జంగ్ కంచె సర్వేనెంబర్ 1 లో 6ఎకరాల 10 గుంటల ప్రభుత్వ సీలింగ్ భూమి గా నిర్ధారించిన అధికారులు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మేడిపల్లి మండలం తహసిల్దార్ సమక్షంలో సాయి ఐశ్వర్య కాలనీ, సత్యనారాయణపురం కాలనీ సీలింగు భూమి లో నిర్మించిన ఇండ్లను, అపార్ట్మెంట్లను కూల్చివేసిన విషయం అందరికి విధితమే, నిర్మాణదారులు కోర్టు ఆర్డర్ ముసుగులో తిరిగి నిర్మాణాలను చేస్తున్నారని,వెంటనే సీలింగ్ భూమి లో హెచ్ఎండిఏ ఇచ్చిన నిర్మాణ అనుమతులను రద్దు చేయాలని హెచ్ఎండిఏ కమిషనర్ కు మాజీ వార్డ్ మెంబర్ పల్లె బాలరాజ్ గౌడ్ వినతిపత్రం అందజేశారు.

# ఆటల పోటీలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి: కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



నమస్తే హైదరాబాద్ ( శేరిలింగంపల్లి న్యూస్) : ఆటల పోటీలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి అన్నారు.శనివారం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు సతీష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో 16 నుండి రేపు 17వ తేదీ వరకు నిర్వహించనున్న 38వ తెలంగాణ ఇంటర్ డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్ క్యోరుజి %ు% 13వ పూమ్సే తైక్వాండో ఛాంపియన్‌షిప్ 2024 కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించిన తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె శివ సేన రెడ్డి, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి . ఈ సందర్భంగా మాట్లాడుతూ తైక్వాండో, కరాటే, కుంఫు,లాంటి క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు పిల్లల్లో మానసిక స్థైర్యాన్ని, అలాగే స్వీయ రక్షణ సామర్థ్యాన్ని పెంచుతాయని అన్నారు.ముఖ్యంగా ఆడ పిల్లల తలిదండ్రులు ఇలాంటి క్రీడలు నేర్చుకునేలా ప్రోత్సహించాలని అన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలన్నారు.పాల్గొన్న క్రీడాకారులను ప్రోత్సహిస్తూ, ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు సతీష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతం చేయండి..

## కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్




నమస్తే హైదరాబాద్ (కూకట్పల్లి)కూకట్పల్లి నియోజకవర్గం లో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వే పై నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ శనివారం పార్టీ నాయకులతోను ఆటు అధికారులతోనూ చర్చించారు. ముందుగా బాలానగర్లోని పార్టీ కార్యాలయంలో బ్లాక్ అధ్యక్షులు డివిజన్ అధ్యక్షులు మహిళా అధ్యక్షులు యూత్ కాంగ్రెస్ నాయకులతో సమగ్ర సర్వేపై విపులంగా చర్చించారు సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమం కావడంతో సమగ్రసర్వే విజయవంతం కావడానికి పార్టీ పరంగా తీసుకోవాల్సిన చర్యలను ఆయన నాయకులకు కార్యకర్తలకు వివరించారు సర్వేను విజయవంతం చేయడానికి అవసరమైన సందర్భంలో పార్టీ కార్యకర్తలు అధికారులకు సహకరించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువు మేరకు గడువు లోపల అధికారులు పూర్తిచేసేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం కులగణన పై సర్వే నిర్వహిస్తున్న అధికారులతో బాలానగర్లోని వార్డు కార్యాలయంలో రమేష్ సమీక్ష సమావేశం నిర్వహించారు సర్వే కోసం ఇంటింటికి వెళ్ళినప్పుడు అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలపై అక్కడ పడుతున్న సమయం, ప్రజల నుంచి ఎలాంటి సహకారం అందుతుంది అన్నదానిపై అధికారులతో రమేష్ చర్చించారు. ప్రజల నుంచి సరైన స్పందన ఉంటుందా లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు సమగ్ర సర్వేపై ప్రజల్లో అవగాహన కోసం ఏమైనా చర్యలు తీసుకోవాల్సి ఉందా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళ నాయకురాలు తదితరులు పాల్గొన్నారు

# నందవరం చౌడేశ్వరిమాత హుండీ లెక్కింపు



బనగానపల్లె మండలం నందవరం చౌడేశ్వరిమాత 07-08-2024 నుండి 16-11-2024 వరకు గల హుండీని లెక్కించడం జరిగినది. మొత్తం హుండీ ఆదాయం 1827724 రూపాయలు వచ్చినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమములో ఆలయ కార్యనిర్వహణ అధికారి జి. కామేశ్వరమ్మ తనిఖీ అధికారి హరీష్ చంద్రా రెడ్డి , ఆలయ అర్చకులు , నందవరం గ్రామీణ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ ఎస్. బాబు మరియు ఆళ్లగడ్డ సేవాసమితి సంఘం వారు పాల్గొన్నారు.

# సినిమా



## సాయి పల్లవి ఇంతలా మేకప్ వేసుకుంది ఏ సినిమాకోసమో తెలుసా..?



లేడీ పవర్ స్టార్ సాయి పల్లవి సినిమా కోసం ఫ్యాన్స్ ఈగర్‌గా ఎదురుచూస్తున్నారు. మలయాళ ఇండస్ట్రీతో హీరోయిన్‌గా పరిచయం అయ్యింది సాయి పల్లవి. ఫిదా సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది ఈ ముద్దుగుమ్మ. తొలి సినిమాతోనే తెలుగు ప్రేక్షకులకు దగ్గరయిన ఈ అమ్మడు ఆతర్వాత వరుస సినిమాలతో దూసుకుపోతోంది. తెలుగుతో పాటు తమిళ్ లోనూ నటించి మెప్పించింది ఈ బ్యూటీ. నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలు చేస్తూ రాణిస్తుంది ఈ అమ్మడు. నేచురల్ బ్యూటీగా ఈ చిన్నది మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. ఇక సాయి పల్లవి తెలుగులో తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్ రేంజ్ కు వెళ్ళింది. ఇక ఇప్పుడు తెలుగు, తమిళ్‌తో పాటు హిందీలోనూ సినిమాలు చేస్తుంది.సాయి పల్లవి సినిమా వస్తుందంటే చాలు ఫ్యాన్స్ కు పండగే .. ఆమెకోసమే సినిమాలు చూసే ఆడియన్స్ చాలా మంది ఉన్నారు. ఇక సాయి పల్లవి పాత్ర కోసం చాలా కష్టపడుతుంది. నటనకు ప్రాధాన్యత ఉన్న సినిమాలు ఎంచుకోవడమే కాదు. ఆ పాత్రలకు జీవం పోస్తుంది ఈ ముద్దుగుమ్మ. తాజాగా సాయి పల్లవి మేకప్ కు సంబందించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. సాయి పల్లవి ఏ సినిమా కోసం ఇంతగా కష్టపడుతుందో తెలుసా.? ఆ సినిమా మరేదో కాదు. నేచురల్ స్టార్ నాని హీరోగా నటించిన శ్యామ్ సింగరాయ్.నాని హీరోగా నటించిన శ్యామ్ సింగరాయ్ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమాలో నానికి జోడీగా కృతిశెట్టి, సాయి పల్లవి నటించారు. ఈసినిమాలో దేవదాసిగా నటించింది పల్లవి. అలాగే సినిమా చివరిలో వృద్ధురాలిగా కూడా కనిపించింది. అందుకోసం సాయి పల్లవి ఇంతలా మేకప్ వేసుకుంది. శ్యామ్ సింగరాయ్ సినిమాలో సాయి పల్లవి తన నటనతో కట్టిపడేసింది. అలాగే క్లాసిక్ డాన్స్ లోనూ అదరగొట్టింది.



## జామపండు తినడం వారికి మంచిది కాదంట.



జామపండులో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. జామను ఆరోగ్యానికి చాలా ఉపయోగకరమైనదిగా పరిగణిస్తారు.. ఈ రుచికరమైన జామపండు తినడం వల్ల రోగనిరోధక శక్తిని పెంచుతుంది.. జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది.. చర్మాన్ని కూడా మెరుగుపరుస్తుంది. ఇందులో విటమిన్ సి, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి. శీతాకాలంలో ఎక్కువగా లభించే జామపండు ఆరోగ్యానికి మంచిదే కానీ.. కొందరికీ.. హాని కలిగిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో, జామ తీసుకోవడం ఆరోగ్యానికి హానికరమని.. ఇది మీ సమస్యలను పెంచుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నవారు ఎక్కువగా జామపండు తినకూడదో ఇప్పుడు తెలుసుకోండి..పొట్టలో అసిడిటీ సమస్య: మీకు కడుపులో ఆమ్లత్వం లేదా గ్యాస్ సమస్య ఉంటే మీరు జామపండుకు దూరంగా ఉండాలి. జామపండులో ఉండే యాసిడ్, ఫైబర్ కడుపులో ఎసిడిటీని పెంచి, మంటను, అసౌకర్యాన్ని కలిగిస్తుంది. ముఖ్యంగా దీన్ని ఖాళీ కడుపుతో తినడం వల్ల ఈ సమస్య మరింత తీవ్రమవుతుంది.

కడుపు నొప్పి, విరేచనాలు %-% మలబద్ధకం : జామలో అధిక ఫైబర్ కంటెంట్ ఉంటుంది.. ఇది జీర్ణవ్యవస్థను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అయితే దీని గింజలను నమిలి తింటే మలబద్ధకం సమస్య పెరుగుతుంది. జామ గింజలు పేగులకు అంటుకుని జీర్ణక్రియలో సమస్యలను కలిగిస్తాయని పేర్కొంటున్నారు. జామపండు ఎక్కువగా తినడం వల్ల కడుపు నొప్పి, విరేచనాలు లేదా మలబద్ధకం ఏర్పడవచ్చు. సున్నితమైన కడుపు ఉన్నవారిలో ఇది ఎక్కువగా కనిపిస్తుందని పేర్కొంటున్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తులు: కిడ్నీ సంబంధిత సమస్యల విషయంలో జామ తీసుకోవడం తగ్గించాలి. జామపండులో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. ఇది మూత్రపిండాల పనితీరును ప్రభావితం చేస్తుంది. కిడ్నీ రోగులు వారి వైద్యుడిని సంప్రదించిన తర్వాత మాత్రమే తినాలని సూచిస్తున్నారు.

డయాబెటిక్ పేషెంట్లు: జామపండులోని తీపి సహజమే, కానీ దాని అధిక వినియోగం రక్తంలో చక్కెర స్థాయిని పెంచుతుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులు దీనిని పరిమిత పరిమాణంలో మాత్రమే తినాలి.. అంతేకాకుండా.. వారి చక్కెర స్థాయిలను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తూ ఉండాలి.

అలర్జీలు %-% స్కిన్ ఇరిటేషన్ : కొంతమందికి జామపండులోని రసాయనాల వల్ల అలర్జీ రావచ్చు. జామపండు చర్మపు చికాకును కూడా కలిగిస్తుంది లేదా తామరను మరింత తీవ్రతరం చేస్తుంది.

జలుబు %-% దగ్గు: జామకు చలువ చేసే గుణం ఉంది.. దీనిని తింటే జలుబు %-% దగ్గు సమస్య పెరుగుతుంది. తేలికగా జలుబు ఉన్న వారు జామపండ్లను తినకూడదు.

## ఇంట్లో బంగారం ఉంటే పన్ను చెల్లించాలా?



భారతదేశంలో బంగారం కొనడం శుభప్రదంతో పాటు పెట్టుబడికి చాలా ప్రసిద్ధి చెందింది. ఇది వివాహాలు, పుట్టినరోజులు లేదా ఏదైనా పెద్ద పండుగకు బహుమతిగా కూడా ఇస్తుంటారు. అలాగే మన భారతీయ సాంప్రదాయంలో బంగారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుంటారు. భారతీయ మహిళలకు బంగారు ఆభరణాలపై భిన్నమైన క్రేజ్ ఉంది. బంగారం చాలా ఖరీదైనది. చాలా మంది దానిని సురక్షితంగా ఉంచడానికి బ్యాంక్ లాకర్లను ఉపయోగిస్తారు. కానీ, చాలామంది దీన్ని ఇంట్లోనే ఉంచుకుంటారు. అటువంటి పరిస్థితిలో ఇంట్లో ఎంత బంగారాన్ని ఉంచవచ్చనే నియమం చాలా మందికి ఇప్పటికీ తెలియదు (భారతదేశంలో గోల్డ్ స్టోర్ రూల్). పరిమితికి మించి బంగారం ఇంట్లో ఉంచుకుంటే దానికి లెక్క చెప్పాల్సిందే. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ (%జదీఱ%) నిబంధనల ప్రకారం.. ఇంట్లో పరిమితికి మించి బంగారం ఉంటే, దాని గురించి ఆదాయపు పన్ను శాఖకు సమాచారం ఇవ్వాలి. అదే సమయంలో ఇంట్లో ఉంచిన బంగారానికి సంబంధించిన రుజువు కూడా ఉండాలి. రుజువుగా బంగారం ఎక్కడ నుండి కొనుగోలు చేయబడింది లేదా ఎవరు బహుమతిగా ఇచ్చారో పేర్కొనాలి. %జదీఱ% సర్క్యులర్ ప్రకారం, ఏదైనా బంగారం లేదా బంగారు ఆభరణాలు వారసత్వంగా వచ్చినట్లయితే పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. అయితే వారసత్వంగా వచ్చిన బంగారు ఆభరణాలను విక్రయిస్తే పన్ను చెల్లించాల్సి ఉంటుంది.అదే సమయంలో ఒక వ్యక్తి ఏదైనా బంగారు ఆభరణాలను కొనుగోలు చేసి మూడేళ్లలోపు విక్రయిస్తే, అతను స్వల్పకాలిక క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. 3 సంవత్సరాల తర్వాత బంగారాన్ని అమ్మితే దీర్ఘకాలిక క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్ చెల్లించాలి.

## శుభవార్తను పంచుకున్న రోహిత్ శర్మ..



భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ ఇంట్లో ఆనందం వెల్లివిరిసింది. ఆయన భార్య రితికా సజ్దే శుక్రవారం (నవంబర్ 15) పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. 2015 డిసెంబర్ 13న పెళ్లిపీటలెక్కిన రోహిత్ -రితిక దంపతులకు 2018లో సమైరా అనే కుమార్తె జన్మించింది. ఇప్పుడు ఈ ఫ్యామిలీలోకి మరో బుల్లి హిట్ మ్యాన్ వచ్చేశాడు. కొడుకు పుట్టిన ఆనందోత్సాహంలో మునిగి తేలుతున్న రోహిత్ శర్మ ఈ సంతోషకరమైన వార్తను తొలిసారిగా సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకున్నాడు. తన సోషల్ మీడియా ఖాతాలో ఒక యానిమేటెడ్ ఫోటోను పంచుకున్న రోహిత్ శర్మ 'మే నలుగురు అయ్యాం' అని క్యాప్షన్ ఇచ్చాడు. ఈ యానిమేటెడ్ ఫోటోలో, ఒక జంట సోఫాలో కూర్చుని నవ్వుతూ కనిపించగా, ఒక చిన్న అమ్మాయి తన ఒడిలో నవజాత శిశువును పట్టుకుని కనిపించింది. రోహిత్ పోస్ట్ కొద్ది క్షణాల్లోనే వైరల్ గా మారింది. అభిమానుల నుంచి భారీ స్పందన వచ్చింది. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు రోహిత్ దంపతులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఇక నెటిజన్లు కూడా క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. ఒకరు డబ్ల్యూపీఎల్ కు, మరొకరు ఐపీఎల్ కు అంటూ రోహిత్ పోస్టుకు కామెంట్స్ ఇస్తున్నారు.ముంబైలోని స్థానిక ఆసుపత్రిలో శుక్రవారం రాత్రి రితికా ప్రసవించినట్లు తెలుస్తోంది. కాగా బిడ్డ కోసం ఎదురుచూస్తున్న రోహిత్ శర్మ, ఆస్ట్రేలియా సిరీస్‌లో మొదటి మ్యాచ్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. అయితే ఈ బోర్డర్ %-% గవాస్కర్ టెస్ట్ సిరీస్ ప్రారంభం కావడానికి ఇంకా 6 రోజులు ఉన్నాయి.. ఈ సందర్భంలో పెర్త్ వేదికగా జరిగే తొలి టెస్టు మ్యాచ్‌లో రోహిత్ ఆడే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. నవంబర్ 22 నుంచి భారత్, ఆస్ట్రేలియా మధ్య తొలి టెస్టు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఒకవేళ అతను తొలి మ్యాచ్‌కు అందుబాటులో లేకుంటే జస్ప్రీత్ బుమ్రా భారత జట్టుకు నాయకత్వం వహిస్తాడు.

Printed published and owned by Godishala Somaiah published from # 15-76,Medipally, Ghatkesar,Ranga reddy,Dist,Printed at Sri SehaSai Printers,IDA BalaNagar, Hyderabad,Editor : Godishala Somaiah,email:nhnews24@gmail.com,ph 9912580066,RNI APTEL/2012/45237..